# అరటి తొక్క

భరత వర్షే, భరత ఖండే, మేరుపర్వత దక్షిణ దిగ్భాగే, కృష్ణా పెన్నానదీ మధ్యప్రదేశ్, గుంటూరు జిల్లే, పొన్నూరు నామధేయస్య విశేష గ్రామం గుంటూరు పట్టణానికి బాపట్ల మహాగ్రామానికి మధ్యన ఉంది. పొన్నూరు గ్రామవాసులు గాని, బాపట్ల గ్రామవాసులు గాని వాళ్ళ ఊరిని గ్రామం అని చెప్పడానికి అంగీకరించరు. ఆ గ్రామాలను పట్టణాలని గాని, టౌన్లని గాని చెప్పుకోవడం వాళ్ళకిష్టం.

ఆ చిన్న ఊళ్ళని వాళ్ళు సిటీస్‌గా భావించకపోవడం మన అదృష్టం. ఈ ఊళ్ళల్లో, పట్టణాలలో ఉన్నంత జనాభా ఉంది. ఒకటో రెండో పెట్రోలు లేక డీజిల్ బంకులున్నాయి. ఒక మోస్తరు పెద్దవని చెప్పదగిన హోటళ్ళు కూడ అక్కడ ఉన్నాయి. తాలుకాఫీసు, పోలీసుస్టేషను, పోస్టాఫీసు, టెలిగ్రాఫ్ ఆఫీసు, బస్టాండు, రైల్వేస్టేషను కూడ ఆ రెండు ఊళ్ళకు ఉన్నాయి. ఇవన్నీ ఉన్నప్పుడు ఆ ఊళ్ళను టౌన్లుగా ఎందుకు చెప్పకూడదని ఆ గ్రామాల వాసులు అడుగుతారు.

కానీ అవి టౌన్లు అయితే అక్కడ స్కూళ్ళు, కాలేజీలు కూడ ఉండాలి కదా! అయితే పొన్నూరు, బాపట్లల్లో అలాంటివి ఎన్నో ఎన్నో విద్యాసంస్థలే కాక ఆ విద్యా సంస్థల్లో తప్పినవారి కోసం ఎన్నో ట్యుటోరియల్ కాలేజీలు కూడ ఉన్నాయి. టెలిఫోన్ ఉన్న ఎన్నో ఇళ్ళు ఆ గ్రామాల్లో ఉన్నాయి. టెలివిజన్ లేని ఇళ్లు చాలా తక్కువనే చెప్పాలి. సర్కారు సారా షాపులేకాక ఇండియా నిర్మిత విదేశీయ మద్యం షాపులు కూడ ఎన్నికావాలన్నా అన్నీ పుష్కలంగా అక్కడ ఉన్నాయి. ఇన్ని ఎక్కువ ప్లస్‌పాయింట్స్ ఉండడం వల్ల మనం కూడ ఎటువంటి అభ్యంతరం పెట్టకుండ వాటిని టౌన్లుగానే పరిగణిద్దాం. తర్కానికి అనవసరమైన విషయాన్ని మనం రేపెట్టినా ఏం ప్రయోజనం?

పొన్నూరు అనే టౌనులాంటి ఆ గ్రామానికి చుట్టూ బాగా డబ్బున్నవాళ్ళు నివసించే చాలా గ్రామాలున్నాయి. అక్కడ చాలమంది యువకులు, మధ్యవయ

స్కులు, లేత ముసలివాళ్ళు సాయంకాలంలో టౌనువరకు పోయివస్తాం' అని చెప్పి పొన్నూరులో...... రోడ్లమీద గుంపుగా చేరి ఆ ఊరిని కనీసం ఒక ఈవెనింగ్ టౌన్‌గా మార్చుతుంటారు. యువకులు రోడ్లకిరువైపుల ఉన్న కొన్ని ప్రత్యేక స్థలాల్లో చిన్నచిన్న కమిటీలుగా కూర్చుని చదువువిషయం తప్ప అన్ని లౌకిక వ్యవహారాల్నీ చర్చిస్తూ ఉంటారు. ఆ రోడ్డుమీద నడిచివెళ్తున్న అమ్మాయిలే కాక ఆ రోడ్డు కూడా తెలియని అమ్మాయిలు సైతం వారి ఎజెండాలో చర్చనీయాంశాలే. అయితే వాళ్ళు చేసే అల్లరి వల్ల ఆ ఊరివాళ్ళకుగాని, ప్రత్యేకించి స్త్రీలకుగాని పెద్ద ఇబ్బంది లేదు.

అయితే మధ్యవయస్కులు, లేత ముసలివాళ్ళు టీ షాప్ లోపలగాని, దాని పరిసరాల్లోగాని లేక కిళ్ళీ షాపుల దగ్గరగాని ఎక్కువగా చేరి కాలక్షేపం చేస్తుంటారు. ఆ స్థలాలు వారికి పఠన శాలలుగా కూడా మారుతుంటాయి. కొందరు ఆ రోజు న్యూస్‌పేపర్ చదివి జార్జిబుష్, సద్దాం హుస్సేన్, గోర్బచేవ్ మొదలగు దగ్గిర పరిచయస్థుల బుద్ధి శూన్యత గురించి, వారి తప్పుడు చేష్టల గురించి సజీవ చర్చలు చేస్తుంటారు. సంధ్యా సమయంలో ఎక్కువ చీకటి కాకముందే చాలమంది స్వగృహాలకు చేరుతుంటారు. కొంతమందికి అంత తొందరగా టౌన్‌ను వదిలిపెట్టడం ఇష్టం లేకపోవచ్చు. వాళ్ళు తాగుడు, తిండి మొదలైన కార్యక్రమాలు ముగించి చీకట్లో గట్లవెంట నడుస్తూనో, పడుతూనో, పడుతూలేస్తూనో అర్థరాత్రి లోపల ఇళ్ళకు చేరతారు.

అంతేకాక, అన్ని సినీమాహాళ్లలో రెండో ఆటకు కూడ నిండుగా జనం ఉంటారు.

పొన్నూరుకు ఆ పేరు ఎందుకు వచ్చినట్లు? మలయాళంలో, తమిళంలో గాని అయితే దాని అర్థాన్ని బంగారం లాంటి స్థలం అని గాని, బంగారం చాలా ఉన్న ఊరనిగానీ వ్యాఖ్యానించవచ్చు. బంగారు నగల్ని ఎక్కువగా పెట్టుకొనే స్త్రీలకు ఆ ఊర్లో కరువులేదు. ఏ బంగారు నగలు పెట్టుకోని బంగారం లాంటి అమ్మాయిలు కూడ ఆ ఊర్లో ఎక్కువగానే ఉన్నారు.

చుట్టూ ఉన్న గ్రామాల్నించి అక్కడికి బంగారం లాంటి అరటిగెలలు కూడ వస్తాయి. అక్కడ ప్రతిరోజూ అరటి గెలల సంత కూడ జరుగుతుంది. అమృతపాణి ఒక లావుపాటి స్త్రీ లాంటి ఇరవైనాలుగు కారెట్ల బంగారం అయితే, చక్కెరకేళీ కొంచెం రాగి కలిసిన పద్దెనిమిది కారెట్ల బంగారం అవుతుంది. కర్పూరపు చక్కరకేళీ వెండి కలిసిన పధ్నాలుగు కారెట్ల బంగారం మాదిరి ఉంటుంది. ఇలాంటి అనేకరకాల బంగారాల విక్రయ కేంద్రం కావడం వల్ల కావచ్చు, ఆ గ్రామానికి పొన్నూరని పేరు వచ్చింది.

అన్ని రాజకీయ పార్టీలకు చెందిన మనుషులు అక్కడ ఉన్నారు. కాంగ్రెసు, తెలుగుదేశం పార్టీ సభ్యులు ఎన్నికల సమయాల్లోనేకాక, ఎన్నికలు లేని సమయాల్లో

కూడ తమ బలాబల పరీక్షలు చేస్తూనే ఉంటారు. సంఖ్యాబలంలో అంత గణనీయమైన పార్టీలు కాకున్నా, జనతా, భారతీయ జనతాపార్టీల అగ్రనాయకులు ఆ పొన్నూరు ప్రబుద్ధ అంతరిక్షంలో తరంగాలు సృష్టిస్తూనే ఉంటారు. రాజకీయ పార్టీలు కులం పేరుతోగాని, కులాతీతంగా గాని పెరగడంగాని, తరగడం గాని చేస్తుంటాయి. 'మతమేమయినా మనిషి బాగుపడాలి' అని చెప్పినట్లు కులమేమయినా పార్టీ బాగుపడాలి అని దృఢంగా నమ్ముతున్న మతేతర తత్త్వవిశ్వాసులయిన కొందరు పార్టీ ప్రముఖులు కూడ ఆ ఊర్లో ఉన్నారు. లైన్స్‌క్లబ్, రోటరీ క్లబ్ మొదలైన సంస్థలు కూడ ఆ ఊళ్ళో ఉన్నాయి. ఈ మధ్యన లైన్స్‌క్లబ్ స్థాపనోత్సవంలో కార్యక్రమాల తుది అంశమయిన ''పెలిసిటేషన్స్' అనే శుభాకాంక్షలు తెలిపే సందర్భంలో కొన్ని క్లబ్బుల, కొందరు వ్యక్తుల పేర్లు అనౌన్స్ చేస్తున్నప్పుడు లోకల్ అడ్వొకేట్ శ్రీ హనుమంతరావు అనే పేరు వినిపించింది. ఏభైయైదు సంవత్సరాల వయస్సున్న శ్రీ హనుమంతరావు వేదికకు వెళ్ళే తీరు చూస్తున్న వారికి ఏదో గందరగోళం జరగబోతోందని అనిపించింది.

కోపావేశం వల్ల అతని ముఖం బాగా కంది ఉంది. తలమీద లెక్కపెట్టకలిగినంతగా ఉన్న వెంట్రుకలు లేచి నిలబడ్డాయి. అతని నడక చూస్తే ఆయన భూదేవినే పాదమర్దనం చేస్తున్నాడా అనే అనుమానం కలగవచ్చు. స్టేజి మీదకు వచ్చి మైకు చేతిలోకి తీసుకొని అతనిలా ఆక్రోశించాడు. ''నేను లోక్‌దళ్‌కు చెందినవాణ్ణని చెప్పే మనిషి తెలివి చాలా గొప్పదే. ముందెప్పుడో దానిలో ఉన్నమాట వాస్తవమే. కానీ నేను బిజెపిలో చేరి ఎన్నో సంవత్సరాలయింది. అయినా ఇప్పుడుకూడ లోక్‌దళ్‌లో ఉన్నట్లే వీళ్ళు అనౌన్స్ చేస్తున్నారు.'' ఆ గర్జన విని సభలో ఉన్నవాళ్ళు నవ్వడం మొదలుపెట్టారు. కొందరికి నవ్వి, నవ్వి కడుపునొప్పి కూడ వచ్చింది. కానీ, ఆ తోకలేని హనుమంతుడికి మాత్రం జనాన్ని అంతగా నవ్వించే జోకు ఏమీ తాను వెయ్యలేదన్న ఫీలింగుతో కోపం ఇంకా ఎక్కువ అయింది. అంతలోపల, అనౌన్సర్ తన నవ్వుకు కళ్ళెం వేసుకొని ఆ 'ఉచ్ఛభాషిణి'లో కోపంతో వణుకుతున్న న్యాయకోవిదునితో ఇలా అన్నాడు.

''హనుమంతరావుగారూ! మీ పేరు చెప్పినపుడు నేను లోకల్ అడ్వొకేట్ అని చెప్పాను. అంటే స్థానిక న్యాయస్థానంలో ప్రాక్టీసు చేస్తున్న అడ్వొకేట్ అనే. కానీ 'లోక్‌దళ్'కు చెందినవారని చెప్పలేదు.''

కొత్తగా చేసిన ఈ అనౌన్స్‌మెంట్ సభికుల రెండో నవ్వుల టపాకాయల వరసకి నిప్పుపెట్టినట్లయింది. ఆ సభాహాసం మధ్యలో ఆ పిచ్చిలాయర్ ''సరే! ఫరవాలేదు'' అని తప్పుచేసిన ఒక అపరాధికి క్షమాభిక్షపెడ్తున్నట్లు అనౌన్సర్‌తో లౌడ్ స్పీకర్ ద్వారా చాలా సీరియస్‌గా చెప్పి తన శుభాకాంక్షలను క్రొత్త కార్యనిర్వాహక వర్గానికి తెల్పుతూ ఆ హాల్ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు నిష్క్రమించాడు.

పొన్నూరుకు ఆనుకొని ఉన్న గ్రామం నిడుబ్రోలు. ఎక్కడవరకు పొన్నూరు ఉందో, ఎక్కడనుంచి నిడుబ్రోలు మొదలవుతుందో అనేది ఒక వివాదాంశం కాదు కాని ఎవరికీ స్పష్టంగా తెలియని విషయం కూడ. ఇండియా-బంగ్లాదేశ్‌లకు మధ్య ఉన్న సరిహద్దులు ఇనుపకంచె వేసినట్లు గ్రామాల మధ్య సరిహద్దులు నిర్ణయించాల్సిన అవసరం లేదుకదా! ఆ ఊరివాళ్ళు ఈ రెండు గ్రామాల్ని 'ట్విన్‌టౌన్స్' అంటారు. వాళ్ళల్లో కొందరు వాటిని 'ట్విన్ సిటీస్' అనడానికి కూడ వెనుకాడరు.

''మన ఊరిని సిటీ అనుకోడానికి మనకే సిగ్గయితే ఇంక దీనికి పురోగతి ఎలా సాధ్యమవుతుంది'' అని వాళ్ళు వాదిస్తారు.

'ది టేల్ ఆఫ్ టూ సిటీస్' అని ఛార్లెస్ డికెన్స్ అతని ఊళ్ళ గురించి రాశాడుకదా! అందుకే 'పొన్నూరు-నిడుబ్రోల్' మనిషి ఒకరు..... డార్లింగ్ చికెన్స్ అయినా ఫరవాలేదు...... తెలుగులో ఒక మహత్తరమైన గద్యోపహారాన్ని ఆ ఊళ్ళ గురించి రాస్తే అందులో తప్పు పట్టాల్సిందేం లేదు.

పొన్నూరు బస్టాండుకు దగ్గరగా ఉన్న ఒక కిళ్ళీ షాప్‌కు అప్పారావు యజమాని. ఆ షాప్ వల్ల అతనికి ఎనలేని గర్వం ఉంది.

అతనికి మామగారితో గొడవలుండడం వల్ల; ఆ మామగారు ఆ ఊరికి పెద్ద కాంగ్రెస్ నాయకుడు కావడం వల్ల నలభయ్యేళ్ళున్న ఆ అప్పారావు తెలుగుదేశం పార్టీకి ఒక ఫైర్‌బ్రాండ్ కార్యకర్తగా రూపాంతరం చెందడం జరిగింది. కానీ అది తెలుగుదేశం పార్టీ ప్రభుత్వాధికారం చేపట్టాక మాత్రమే. అయితే మామతో రాజకీయప రంగా వాగ్వివాదానికి ఎప్పుడయినా దిగడం సంభవిస్తే ''తెలుగుదేశం పార్టీ'' ఆ మామ తాత పుట్టక మునుపే పుట్టిందనే ధోరణిలో అప్పారావు వాదిస్తాడు. పొన్నూరులోనే కాక గుంటూరు జిల్లాలో ఎక్కడ తెలుగుదేశం పార్టీ మీటింగు జరిగినా పెద్దపెద్ద కార్యక్రమాలు జరిగినపుడు అతను తప్పకుండా పాల్గొనేవాడు. మహానాడు సమయంలో కనీసం 15 రోజులు అతను పొన్నూరులో కనిపించడు. అతను ఊరు వదిలిపెట్టి వెళ్ళినప్పుడు అతని షాప్‌ను చూచుకొనేది అతని రక్తసంబంధీకులు కాదు. తెలుగుదేశం పార్టీలో అతనికి చెంచాగిరీ చేసి బతుకుతున్న పాంచజన్యం అనే ఒక అయిదడుగుల వ్యక్తిమీదనే ఆ విషయంలో నమ్మకముండేది. పాంచజన్యానికి, పుట్టినద గ్గర్నుంచీ తండ్రెవరో తెలియదు. అతనికి ఒకే ఒక చెల్లెలు ఉండేది. ఆ ఇద్దరు పిల్లల జన్మకర్త ఎవరో స్పష్టంగా ఆ తల్లికి కూడ తెలియదు. ఏమయినా ఈ ఊరివాళ్ళలో కొందరు పాంచజన్యానికి సార్థకనామధేయమే పెట్టారు అనడం పట్ల నాకు చాలా తీవ్రమైన అభ్యంతరం ఉంది.

కుప్పారావుకు కూడ అప్పారావు వయస్సే ఉంటుంది. అతనికి దూరపు బంధువు కూడ. కొంతకాలం నుంచి ఆ ఊళ్ళో కౌన్సిలర్‌గా కాంగ్రెస్ పతాకాన్ని ఎగిరేటట్లు

చేస్తున్న అతి దూరపు బంధువు కావడం వల్ల ఆ దూరపు బంధుత్వానికి దూరం మరింత ఎక్కువ అవుతూనే వచ్చింది. కుప్పురావు మనసులో అప్పారావు పట్ల విషబుద్ధి లేదుగాని అప్పారావు మనసులో కుప్పు పట్ల చాలా ద్వేషం, రోషం ఉండేవి. అవి దినదిన ప్రవర్థమానమయ్యాయంటే అందులో అతిశయోక్తి ఏం లేదు.

ఆ రోజు ఆదివారం. ఆ రోజు పున్నమి చంద్రుడు ఉదయించబోతున్నాడని చంద్రోదయం కాకుండానే అప్పారావు కొట్టుదగ్గర ఉన్న కొంతమందికి ఆరుగంటలకే అర్థమయింది. జరిగిన విషయం ఇది –

అయిదున్నర గంటలకు కుప్పురావు అప్పారావు కొట్టుముందు ప్రత్యక్షమయ్యాడు. ఆకారసౌష్టవాన్ని స్వయంగా ప్రకటిస్తున్న ఒక పెద్ద అమృతపాణి అరటిగెలను దాన్ని బాగా మెరిసేట్లుగా తుడిచి అప్పుడే అక్కడ కట్టి పెట్టడం జరిగింది. చూడగానే కుప్పురావు చెయ్యి గుంజింది. మహత్తరమైన ఒక పనిని చేసే విధంగా అతను ఆ గెలలో నుంచి అతిపెద్ద పండును లాక్కొని దాని తొక్కను ఒలిచి ఆ అరటిపండును మెల్లమెల్లగా కొరికి దాని రుచిని ఆస్వాదిస్తూ బంగారం లాంటి ఆ తొక్కను పక్కకు విసిరేశాడు.

కొట్టులోపల్నుంచి ముందుకు వంగి, కుప్పురావు షర్ట్ కాలర్ పట్టుకొని అప్పారావు గర్జించాడు.

''ఏంటిరా నువ్వు చేసిన పని? ఇది నీ బాబుకొట్టా? నువ్వు మింగింది నీ తాత అరటిపండా?''

''ఏంట్రా! చొక్కా వదులు... చొక్కా వదులు...'' అని కుప్పురావు సంభ్రమంతో అడ్డుకొనే ముప్పయ్యయిదు సెకండ్లలోపల దగ్గర ఉన్న ఏడున్నర మంది మనుషులు- అంటే ఏడుగురు పెద్దవాళ్ళు, ఒక పిల్లవాడు... మెరుపువేగంతో ఆ సంఘటనా స్థలానికి చేరి, తరవాత అరవైమూడు సెకండ్లలో అప్పారావు పట్టు వదిలించారు.

ఏమిటి విషయం? ఏం... జరిగింది? అని వాళ్ళు కళ్ళు పొడుచుకుంటూ అడిగారు. దానికి సమాధానంగా అప్పారావు కోపంతో వణికిపోతూ అన్నాడు.

''వీడు ఏంపని చేశాడో వాణ్ణే అడగండి.''

''ఏం జరిగింది?'' అన్న వాళ్ళ ప్రశ్నకు షాక్ నుంచి పూర్తిగా బయటపడని కుప్పురావు.

''నాకేం అర్థం కావడం లేదు... ఇతనికి దెయ్యం పట్టినట్లుగా నాకనిపిస్తోంది'' అని తలతిరుగుతున్నట్లుగా చెప్పాడు.

''నాకు కాదు దెయ్యం... నీ బాబుకి పట్టింది. మీరిది చూశారా! ఇంత అందమైన గెలని ఈ ఛండాలుడు నాశనం చేశాడే!'' అని గాఢమైన మనోవేదనతో అప్పారావు విలపించాడు. ఈ లోపల ప్రేక్షకుల సంఖ్య పెరుగుతూనే ఉంది.

''గెల ఇతను నాశనం చేశాడా? కానీ... అది ఇక్కడే ఉంది కదా!'' అంటూ ఆ అందమైన గెలను మెచ్చుకోలుగా చూస్తున్న ఆ గుంపులోని ఒకడు అడిగాడు.

అప్పారావులో పెరిగిన క్షోభవల్ల అతని ఉచ్ఛ్వాస నిశ్వాసాలు క్రమగతిని తప్పాయి.

''ఇది ఇంక ఇక్కడ ఉండి ఏంలాభం? దీనిలో ఉన్న అన్నింటిలో కన్న పెద్దదైన అరటిపండుని ఈ ఎద్దుగాడు మింగేశాడే!''

ఎద్దు అన్న మాట వినగానే అంతవరకు షాక్‌లో ఉన్న కుప్పురావుకు కూడ కారం తిన్నట్లయింది.

''ఒరే అప్పారావు... ఎద్దు నీ అయ్యే...'' అంటూ అతను కూడ తిరిగి తిట్టాడు.

''మా నాయనకూడ నీలాగే ఎద్దు అని ఒప్పుకుంటాను. ఎద్దు అంటే మీ వాళ్ళ తాత గుర్తే కదా! లేకపోతే తండ్రిని మర్చిపోయినవాళ్ళు తాతను గుర్తుపెట్టుకుంటారా?''

అక్కడ చేరినవాళ్ళల్లో కొందరు అతను చెప్పింది అర్థమైనట్లు నవ్వారు. మరికొందరు అర్థంకానట్టు నవ్వారు. కుప్పూరావుకు అసలేమీ అర్థం కాలేదు. అప్పారావుని అలా చూస్తూ నిలబడ్డాడు. అప్పుడు అప్పారావు ఉత్సాహం మరింత పెరిగింది.

''మొట్టమొదట వీళ్ళ పార్టీ చిహ్నం జోడెద్దులు. తరవాత అవి ఆవు, దూడగా మారిపోయాయి. ఇప్పుడది ఎద్దూగాదు, ఆవూగాదు, మనిషి కూడ కాదు... చిట్టచివరికి పాపకృత్యాలు చేసే చెయ్యిగా మారింది'' అంటూ అప్పారావు ఛీంకరించాడు.

అక్కడున్న ప్రేక్షక జనానికందరికీ విషయం బాగా అర్థమైనట్లు గొల్లుమని నవ్వారు.

''ఎందుకయ్యా అలా కోతుల్లాగ నవ్వుతారు? నీ పార్టీ ఇంక కొద్దికాలం బతికితే మాత్రం సైకిలు పోయి వట్టి 'టైర్' అయిపోతుంది. తరవాత అది ఖాళీ ''ట్యూబు''గా మారుతుంది. చివరికి సైకిలు తొక్కీ-తొక్కీ.. అరిగిపోయిన అరికాలులాగా అయిపోతుంది'' అని కుప్పురావు కూడ తన వాగ్ధాటిని ప్రదర్శించాడు.

అందరూ మళ్ళీ నవ్వేశారు.

వాళ్ళల్లో ఒక ముసలివాడు తన పెద్దరికాన్ని మాటల్లో ప్రదర్శించాడు.

''పార్టీల చిహ్నాలు కాలక్రమేణ మారడం సహజమే... కాలానికి అనుగుణంగా పార్టీల సిద్ధాంతాలు మారాలి... వాటి గుర్తులూ మారాలి... దాని పేరే కదా పురోగతి?''

ఇంతసేపు ఆ గెల మీదనే కళ్ళను నాటిన ఒక కుర్రవాడికి ఈ రాజకీయ చర్చ ఏమీ నచ్చలేదు.

''ఈ గెల విషయం పరిష్కారం చేయకుండ ఊరికే రాజకీయాల జోలికి పోతున్నారేంటి'' అని అతను అడిగాడు. ఆ గుంపు నవ్వంతా స్విచ్చాఫ్ చేసినట్లు ఒక్కసారిగా ఆగిపోయింది.

''నువ్వు చెప్పేదే కరక్టు రామయ్యా! ఈ గెలను చౌదరిగారితో ఇనాగురేషన్ చేయించాలని నేననుకున్నాను. అంతలోపల ఈ త్రాష్టుడు వచ్చి దాన్ని నాకేశాడు. బంగారం లాంటి మా తెలుగుదేశం రంగు చూస్తే వీళ్ళకు కన్నుకుట్టుతుంది. చూడండి! ఈ గెల మేలిమి బంగారం కాదా? దీన్ని చూడగానే వీడికి నోరూరింది. పోనీ! ఈ గాడిదకు నన్నొక్కసారి అడగాలనైనా అనిపించిందా?'' అని అప్పారావు జనాంతికంగా అంటుంటే ఒళ్ళు పట్టని కోపంతో ఉడికిపోతూ.

''ఒరేయ్! నీ అబ్బకు అబ్బే గాడిద!'' అని కుప్పారావు అరిచాడు.

''ఎవరు ఎద్దో, ఎవరు గాడిదో ఊళ్ళోవాళ్ళందరికి తెలుసు... అది వదిలెయ్... నీకు పండు తినాలనిపిస్తే ఇక్కడ ఎన్ని గెలలున్నాయ్...? చూడు అచ్చం తెలుగుదేశం రంగులో ఉన్న ఈ బంగారు గెలలోని అతిపెద్ద పండునే కదా మింగేశావ్! నా కొట్లో ఏదయినా ముట్టుకోవాలంటే నన్నడగాలి కదా! ఈ కొట్లో ఉన్న దేన్నయినా మేసెయ్యవచ్చనుకున్నావా?''

కుప్పారావును ఇంతగా తిట్టినా కూడ అప్పారావు కోపం మాత్రం కించిత్తు కూడ తగ్గలేదు.

కానీ కుప్పారావు ఈ లోపల కొంచెం శాంతించాడు. తప్పు తనదని తెలుసుకోడం వల్ల అనునయ స్వరంలో ''సరే... సరే అప్పారావ్! నీ కొట్టుకురావడం నా మొదటి తప్పు... ఒక పండు తీసుకోవడం రెండో తప్పు... తెలుగుదేశం రంగులో ఉన్న ఈ గెలలోని పెద్ద పండును తినడం మూడో తప్పు... తెలిసిగాని... తెలియకగాని ఈ తప్పులన్నీ నేను చేశాను... అయితే దీనికి పరిహారం ఏంటి? ఒక్క పండుకు రెండుపళ్ళ ఖరీదు తీసుకో... లేకపోతే ఈ మొత్తం గెల నేనే కొనుక్కుంటా...'' అని అన్నాడు.

చుట్టూ ఉన్న వారందరూ దానికి తలూపారు. కానీ అప్పారావు దాన్ని ఒప్పుకోడానికి సిద్ధంగా లేదు.

''అతను చెప్పే మాట మీరందరు విన్నారుకదా! పెద్దవచ్చాడయ్యా గెల కొనడానికి!... ఇతని పార్టీ నాయకులు మా పార్టీ వాళ్ళను గోనె సంచుల్లో పెట్టడానికి ప్రయత్నం చేస్తున్నారు... పార్టీని చీల్చడానికే చూస్తున్నారు... కావాలంటే మా పార్టీని టోకు మొత్తంగా కొనడానికే సిద్ధంగా ఉన్నారు. వీళ్ళ చేతుల నిండా అంత దొంగడబ్బు ఉందన్నమాట. కానీ మా పార్టీ అంత చిల్లర పార్టీ ఏం కాదు. దీన్ని డబ్బిచ్చి కొనాలని కలలో కూడ అనుకోవద్దు. ఆరుకోట్ల ఆంధ్రుల అభిమాన పార్టీ ఇది... మా అభిమానాన్ని మేము అమ్ముతామా!''

వయస్సు మీద పడడం వల్ల పరిపక్వత వచ్చిందనుకుంటున్న ఒక ముసలాయన.

''ఇదంతా మాకు తెలిసిన విషయమే... ఈ కాలంలో భార్యాభర్తల మధ్య తగాదా వచ్చినా దాన్ని కూడ రాజకీయం చేయడానికి మన నాయకులు ప్రయత్నిస్తారు. ఇక్కడ జనం ఒకామె ప్రసవవేదన పడుతున్నా ఈ డాక్టరు వద్దు, మా పార్టీ డాక్టరే కావాలి అని చర్చిస్తారు. ప్రతి విషయంలో ఈ రాజకీయాలెందుకు? గుళ్ళో ఉత్సవమయినా పార్టీలే... ఎవరయినా చచ్చిపోయినపుడు అతని పెద్ద కర్మకు కూడ రాజకీయమే. ఛీ! ఛీ! మొత్తం కంపు గొట్టిపోయింది. ఈ కుప్పురావు 'ఒక పండును తీసికొని తిన్నాడు... సరే... కానీ దానికి ఏదయినా పరిష్కారం చేయకుండా... ఇలాంటి చిన్న విషయాల్లో కూడ రాజకీయం తేవడం మంచిది కాదు. అతను అడగకుండా ఒక పండు తిన్నాడు అది తప్పే. అలాగని దాన్ని వాంతి చేయించి బైటికి తెప్పించడం సాధ్యమా? పోనీ... రేపు ఉదయం వరకు ఆగుదామంటే అది ఇంకా ఎక్కువ కంపుకొడుతుంది.''

ఆ ముసలాయన ఇక ఎక్కువ మాట్లాడడానికి అవకాశం ఇయ్యకుండా చుట్టూ ఉన్నవాళ్ళు గొల్లుమని నవ్వారు. వాళ్ళల్లో కొందరు పిల్లలు, పిల్లల్లాంటి పెద్దవాళ్ళు ఒక చేత్తో ముక్కుమూసుకున్నారు.

ఆ ముసలాయన జోకు వల్ల ఎవరు సిగ్గుపడాలా అని అప్పారావుకు, కుప్పూరావుకు ఒకేసారి అనుమానం వచ్చింది. కానీ వారి సంశయాన్ని నివృత్తి చేసుకోడానికి వారిలో ఎవరికీ సమయం గానీ, సందర్భంగానీ దొరకలేదు. వాళ్ళ ముఖంలో వచ్చిన వివర్ణ భావానికి, తానట్లా ఆ ముఖాల్లోనే ఉండిపోవాలా? లేక మాయమైపోవాలా అనే నిర్ణయం స్వయంగా తీసుకోడానికి అవకాశం గూడా ఇవ్వకుండా ముసలివాడు తన అధిక ప్రసంగాన్ని కొనసాగించాడు.

''అందుకే ఈ పండు సమస్యను పండు సమస్యగానే మనం ముగిద్దాం. ఒరే అప్పారావ్! ఇతను మింగేసిన పండు ఖరీదు ఎంత? కావాలంటే కొంచెం ఎక్కువగా అడుగు... ఫరవాలేదు. అసలు ఖరీదు కన్న ఎక్కువగా నువ్వు అడిగేదంతా నేని

స్తాను.'' ముసలివాడి ఆఫర్‌ను వినగానే చుట్టూ మూగినవారిలో కొందరికి గెలలో మిగిలిన పళ్ళని కూడ తినాలని అనిపించింది. డబ్బివ్వడానికి ముసలోడు సిద్ధంగా ఉన్నాడు కదా!

కానీ అప్పారావు తన పట్టును కొంచెం కూడ సడలించటానికి ఒప్పుకోలేదు.

''కానీ మావా! ఇది డబ్బుల విషయం కాదు. ఇంత ముచ్చటగా ఉన్న ఈ గెలను ఎంత సంతోషంతో ఇక్కడ కట్టి పెట్టానో నీకు తెలుసా! ఇంత బంగారం లాంటి గెలని నేను జీవితంలో ఎప్పుడూ చూడలేదు. ఈ గెలలో ఉన్న ఏ పండుమీదైనా ఒక్క మచ్చగాని, వాడిపోయిన గుర్తుగాని ఉందా చెప్పు? ఒక్కొక్కపండు బంగారం మూసపోసినట్టుగా లేదా? అందుకే దీన్ని మా పార్టీ ఐశ్వర్యంగా భావించి దీన్ని మా నాయకుడు చౌదరిగారితో ప్రారంభం చేయిద్దామని నేను నిర్ణయించాను... అంతలోనే ఈ మహాపాపి ఈ అత్యాచారాన్ని చేశాడు. మరి... డబ్బుతో దీనికి పరిహారం లభిస్తుందా?''

అప్పారావు కళ్ళల్లో నీరు ఉబికి వచ్చింది... గుండె ఒకసారి వెక్కినట్లయింది. ముసలివాడికి అది అర్థమైపోయింది.

''అప్పారావ్! ఇలాంటి భావాలు అనవసరం.. ప్రతివాళ్ళూ వాళ్ళ పార్టీని ప్రేమించ డంలో తప్పులేదు. ఈ లోకంలో ఉన్న ప్రతి వస్తువురంగును బట్టి ఇది మా పార్టీది, మా పార్టీది అని చెబుతుంటే పార్టీలేని మామూలు వాళ్ళు ఏం చేస్తారు? వాళ్ళు కూడ ఏమయినా తినాలికదా! ఇలా అనుకుంటూ పోతే ఎండుమిరపకాయలనన్నింటినీ కమ్యూనిస్టువాళ్ళు తీసుకొనిపోతారు. అప్పారావ్! ఇవన్నీ వదిలేసెయ్. నీ గెలకు నీ పార్టీ బంగారు రంగు ఉందని చెప్తున్నావే... మరి ఇది పండక మునుపు ఏ రంగులో ఉంది... పండే ముందు కుప్పురావు... పండిన తరవాత అప్పారావు కావడానికి ఈ గెల తండ్రిలేని సంతతి అనుకున్నావా? సరే... అది కూడ వదిలెయ్... పండింతర్వాత కూడ ఆకుపచ్చ రంగులోనే ఉండే అరటిపళ్ళు ఉన్నాయి. ఎర్రరంగులో ఉన్న పళ్ళు కూడ ఉన్నాయి. బైట ఏ రంగులో ఉన్నా లోపల ఉన్న వస్తువు ఒకటే కదా! లోపల ఉన్న పండు సరిగా పక్వానికి రాకపోవచ్చు. ఎక్కువ పండి మాగిపోయి ఉండవచ్చు. కొన్నిటికి మంచి తీపి పట్టి ఉండవచ్చు, వేరే కొన్ని చప్పగా ఉండవచ్చు. బైటికి ఎలా ఉన్నా లోపల కొన్ని మంచివి కావచ్చు. కొన్ని చెడ్డవి కావచ్చు. ఈ రకంగా రాజకీయ పార్టీలంటే మాకు కనిపించేది బైటి తొక్క మాత్రమే. బైటి తొక్క ఏ రంగులో ఉన్నా లోపల ఉన్న వస్తువు ఒకటే. అన్ని పార్టీల్లో మంచివాళ్ళు ఉంటారు. చెడ్డవాళ్ళుంటారు. ఎన్నో రాజకీయ పార్టీలు ఎన్నో రాష్ట్రాల్లో అధికారానికి వచ్చాయి. దానివల్ల మామూలు జనానికి ఏమయినా ప్రయోజనం కలిగిందా? ఏ పార్టీ వచ్చినా పోయినా ప్రజల అవస్థ ఒకటే... అందుకే నా ప్రియమైన అప్పారావ్! ఆ అరటి తొక్క

రంగు గురించి కొట్లాడుకోకుండా కుప్పురావు తినేసిన పండు వెల ఎంతో చెప్పేసెయ్.''

చుట్టూ ఉన్న జనం ఒక నిప్పులు కురిపించిన ఉపన్యాసం విన్నంత సంతృప్తితో వాళ్ళ సొంత రెండుచేతుల్తో దోమల్ని చంపుతున్నట్లు చప్పట్లు కొట్టారు.

ఆ పుష్కల హస్త తాడనశ్రవణం చేసిన అప్పారావుకు ఇంక కొంచెం తగ్గడమే మంచిదని అనిపించింది.

''సరే! వందరూపాయలిచ్చేసెయ్'' అని అప్పారావు నోరు గట్టిగా మూసేశాడు. తరవాత కొట్లో ఉన్న సీసాల మీద దుమ్మును దులపడం అనే సత్కార్మలో మునిగిపోయాడు. అది వినగానే నోరు చాలా ఎక్కువ తెరిచి ఉంచిన వ్యక్తి వేరెవరో కాదు 'నేనెందుకు ఇందులో మూతిపెట్టాను' అని విచారించే మేధావిననుకున్న ఆ ముసలి వాడే.

అలాగే నోరు పెద్దగా తెరవడంలో రెండో స్థానాన్ని పొందినవ్యక్తి కుప్పురావు. చుట్టూ ఉన్నవాళ్ళు నోటిని అంత తెరిచినా, లేక కొంచెం తెరిచినా లేక తెరవబోయి పూర్తిగా తెరవకుండా ఉంచినా అందరూ ఆశ్చర్యస్తబ్ధులై ఉండిపోయారు.

చివరికి చాలా పెద్దగా తెరిచి ఉంచిన అదే నోటికి మొదట చలనం కలిగింది.

''ఒరే అప్పారావ్! ఈ గెలకు మొత్తానికయినా వందరూపాయలు రాదే... ఈ ఒక్క పండుకు వందరూపాయలడగడం అన్యాయం కాదా?''

''అన్యాయమే! అక్రమమే... కానీ వాడు చేసింది న్యాయమేనా? మర్యాదేనా...? నన్ను అడగకుండ వీడు పీకి మింగేసిన పండు ఖరీదు మాత్రం నూరురూపాయలే... దాన్లో ఒక్కపైసా కూడ నేను తగ్గించను... అది పండు ఖరీదు కాదని అనుకోండి. కానీ అది వీడు చేసిన దౌర్జన్యానికి ఖరీదు.''

ముసలివాడి నోరు మళ్ళీ తెరుచుకోలేదు. జనమంతా వాళ్ళ వాళ్ళ నోళ్ళను పూర్తిగా మూసుకోలేదు కూడ.

కుప్పురావు రెండు నిమిషాలు చింతాగ్రస్తుడయ్యాడు. తరవాత ప్రత్యేకమైన ఉత్తేజంతో అన్నాడు.

''నేను చేసిన తప్పుకు... నేను తిన్న పండుకు నేను వందరూపాయలివ్వడానికి సిద్ధమే.''

అప్పుడు జనాల నోరు తెరుచుకోడమే కాక వాళ్ళ కళ్ళు కూడ ముందుకు పొడుచుకువచ్చినాయి.

''కానీ ఒక్క విషయం... నేను పండు తిని ఆ బంగారు రంగు అరటి తొక్కను ఇక్కడ పెట్టాను. వీడు నా మెడను పట్టుకున్నప్పుడు మీరంతా పరుగెత్తి వచ్చి మమ్మల్ని విడిపించారు. మీరంతా దానికి సాక్షులు. అప్పుడితను ఆ అరటి తొక్కను తీసి కోపంతో ఇక్కడే ఉన్న ఆవు మీదికి పారేశాడు. ఆ ఆవు ఏది! ఆ అరటి తొక్కను నములుతూ అది ఎక్కడికో వెళ్ళిపోయింది. వీడు చేసిన తప్పువల్ల ఆ బంగారు తొక్క నాకు నష్టమయింది. నేను దాన్ని భద్రంగా ఉంచాలనుకున్నాను. నాకు అది తప్పకుండా కావాలి. ఒరే అప్పారావ్! ఆ అరటి తొక్క తిరిగి తీసుకురా! ఆ ఆవు నీదేనా? పండు ఖరీదు వందరూపాయలు ఇదిగో తీసుకో! కానీ ఆ అరటి తొక్క ఖరీదు నూట పది.''

షాక్ కొట్టినట్లున్న అప్పారావుకు ఆ వందరూపాయలు తీసుకోడానికి చెయ్యి ముందుకు రాలేదు. చుట్టూ ఉన్నవాళ్ళందరూ ఆ ముసలివాడితో సహా చప్పట్లుకొట్టారు. కొందరు ఈలలు, కొందరు పిల్లికూతలు తమ తమ పశపక్ష్యస్వభావ ప్రకారంగా యథాశక్తి ప్రకటించారు. ఆ రకరకాల ధ్వనుల మధ్య ఇంకా కొంచెం వాగ్వివాదం జరిగింది కాని, చివరికి, అప్పారావు చేతినుంచి ఒక పది రూపాయల నోటు ఆ పండు ముసలివాడి ద్వారా కుప్పురావు జేబుకు ప్రయాణం చేస్తుండగా మొదలైన చప్పట్లు, ఈలలు, పిల్లికూతల ఆర్భాటం సినిమా చివర్లో హీరో దెబ్బల్ని, తన్నుల్ని తిని దాదాపు చచ్చిపోయే స్థితిలో ఉన్న విలన్, అతని గూండాలను పోలీసు అరెస్టు చేసేటప్పుడు నేల టిక్కెట్లవాళ్ళు చేసే హర్షధ్వానం కన్నా ఎంతో హైక్లాసుగా ఉందని ఆ గెలలో మిగిలిన అరటి తొక్కల మెరుపు చూస్తే అందరికీ అర్థమవుతుంది.

---